క్లుప్తంగా

ప్రతి పంటను ఈ-క్రాప్ నమోదు చేయండి



చిందుకూరు గ్రామంలో ఈ-క్రాప్ బుకింగ్ చేస్తున్న వీఏఏ రేణుక

గడివేముల: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసిన ప్రతి సెంటును ఈ-క్రాప్ బుకింగ్ చేయాలని ఏఓ హేమసుందర్ రెడ్డి సూచించారు. ఆయన బుధవారం మండల పరిధిలోని చిందుకూరు గ్రామంలో ఈ-క్రాప్ బుకింగ్ కార్యక్రమం ప్రారంభించారు. ఏఓ మాట్లాడుతూ.. క్రాప్ బుకింగ్‌కు రైతులు సహకరించాలన్నారు. ఖరీఫ్‌లో పంట సాగు చేసిన ప్రతి రైతు ఆధార్ కార్డు, పట్టదారు పాసుపుస్తకం, బ్యాంక్ ఖాతా తీసుకొచ్చి ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలన్నారు. ఈ-క్రాప్ ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. చిందుకూరు వీఏఏ రేణుక, వీఆర్‌ఓ, రైతులు పాల్గొన్నారు.

గోరుకల్లుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



రెగ్యులేటర్ నుంచి గోరుకల్లులోకి వస్తున్న నీరు

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లు జలాశయంలోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఈ నెల 14వ తేదీన బానకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి జలాలను ఎస్సార్బీసీ కాల్వలకు వదిలారు. ఈ ఏడాది మొదటిసారిగా వచ్చిన నీటికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందారెడ్డి జలహారతి ఇచ్చారు. బుధవారం పైనుంచి 5 వేల క్యూసెక్కుల నీరు గోరుకల్లు జలాశయంలోకి వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 2.02 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు చెప్పారు. పైనుంచి వచ్చిన ప్రతి నీటి బొట్టును నిల్వ చేసి రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో చర్చించిన అనంతరం నీరు విడుదల చేసేందుకు నిర్ణయించామన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ



క్రీడా సామగ్రి అందిస్తున్న దృశ్యం

పాణ్యం: మండల పరిధిలోని కొణిదేడు గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సినీ హీరో చిరంజీవి అభిమానులు క్రీడా సామగ్రి అందించినట్లు హెచ్‌ఎం నాగేశ్వరరెడ్డి బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామ మాజీ సర్పంచ్ జి.పుల్లారెడ్డి ఆధ్వర్యంలో రూ.20 వేలు విలువచేసే క్రీడా పరికరాలు అందించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకుని క్రీడల్లో ప్రతిభ చాటుకోవాలన్నారు. ఎంపీటీసీ సభ్యుడు రవిరెడ్డి, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

గుడిపాడులో గుడిసె దగ్ధం

గూడూరు రూరల్: మండల పరిధిలోని గుడిపాడులో బుధవారం తెల్లవారుజామున జరిగిన అగ్ని ప్రమాదంలో గుడిసె దగ్ధమైంది. స్థానిక రైతు వెంకటేశ్వర రెడ్డికి చెందిన కళ్లదొడ్డిలో గుడిసె ఏర్పాటు చేసి పశువులకు అవసరమైన మేత, సామగ్రి ఉంచుకున్నాడు. తెల్లవారుజామున ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో గుడిసెలోని సామగ్రితో పాటు మేత పూర్తిగా కాలిపోయింది. రూ.2 లక్షల మేరకు నష్టం వాటిల్లిందని ఆదుకోవాలని బాధిత రైతు వాపోయాడు.

రేషన్ బియ్యం పట్టివేత

ఓర్వకల్లు: మండలంలోని కాల్వ గ్రామం వద్ద అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం కాల్వ గ్రామం వద్ద చేపట్టిన వాహనాల తనిఖీలలో భాగంగా.. డోన్ పట్టణానికి చెందిన నల్లగొట్ల కృష్ణ, వెల్దుర్తికి చెందిన ఖాసీం శెట్టి సుబ్రమణ్యం ఆటోలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా వెల్దుర్తి వైపు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి 2.8 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకుని, ఆటోను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పండ్ల తోటల అభివృద్ధికి కృషి

కర్నూలు(అగ్రికల్చర్): పండ్ల తోటల అభివృద్ధిపై ఉపాధి సిబ్బంది దృష్టి సారించాలని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి సూచించారు. గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి త్వరలో జిల్లాలో పర్యటించనున్నారని పండ్ల తోటల అభివృద్ధి, అవెన్యూ ప్లాంటేషన్ ముమ్మరం చేయాలని ఆదేశించారు. బుధవారం తన చాంబరు నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ జిల్లాలో పర్యటించడంతో పాటు ఉమ్మడి కర్నూలు యూనిట్‌గా ఉపాధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తారని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి పంచాయతీలో ఉపాధి కార్యక్రమాలకు సంబంధించి 7 రకాల రికార్డులను పకడ్బందీగా అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రతి పని ప్రదేశంలో వర్క్‌సైట్ బోర్డు పెట్టాలన్నారు. ఏపీడీ సలీంబాష పాల్గొన్నారు.

జగనన్న మాటిస్తే తప్పక చేస్తారు



పాదయాత్రలో ప్రజల కష్టాలను నేరుగా తెలుసుకున్న సీఎం వైఎస్ జగనన్న ఇచ్చిన మాట తప్పకుండా నెరవేరుస్తున్నారు. నాకు 19.03.2023 లో పెళ్లి జరిగింది. పేద కుటుంబాల్లో ఆడపిల్లలకు పెళ్లి చేయాలంటే తలకు మించిన భారం. మాలాంటి పేద కుటుంబాలకు వైఎస్సార్ కళ్యాణమస్తు పథకం ఎంతో ఉపయోగకరం. గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందిస్తోంది.

–షేక్ ఫర్హానా, రియాజ్ భాషా, గడివేముల

సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం



గత ప్రభుత్వంలో ఈ పథకానికి అరకొరగా నిధులు మంజూరు చేసి అందించారు. అది కూడా సవాలక్ష నిబంధనలు విధించడంతో ఎవరికీ సరిగా లబ్ధి చేకూరలేదు. ప్రస్తుత ప్రభుత్వంలో వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా పేరుతో ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తున్నారు. సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

–షేక్ నసీమా, అబ్దుల్ ముఖీద్, గడివేముల

పేదల పెళ్లిళ్లకు పెద్దన్న సాయం

- కల్యాణమస్తు, షాదీతోఫాతో పేదింటి యువతులకు సౌభాగ్యం
- ఏడాదిలో మూడుసార్లు నేరుగా లబ్ధిదారుల అకౌంట్లలో జమ
- నగదు ప్రోత్సాహం రెట్టింపు చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలకు మరింత చేయూత

గడివేముల: జీవితంలో మరపురానిది వివాహ బంధం. పెళ్లి చేసి చూడు, ఇల్లు కట్టి చూడు? అని పెద్దలు ఏనాడో చెప్పారు. ఈ రెండు కార్యాలు చేసిన కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు ఉంటాయని దీని సారాంశం. ఇప్పుడు ఆడపిల్లల వివాహం పేద కుటుంబాలకు భారం అవుతోంది. ఎంత తక్కువ ఖర్చుతో వేడుక నిర్వహించాలనుకున్నా బడ్జెట్ దాటిపోతోంది. బంగారం, తాళి బొట్టు, నూతన వస్త్రాలు, భోజనాలు, మండపం ఇలా భజాభజంత్రీలు మోగే వరకూ సొమ్ము ఖర్చు చేయాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో అమ్మాయిని అత్తవారింటికి పంపి పుట్టింటి వారు అప్పుల పాలవుతున్నారు. పేదలకు ఈ పరిస్థితి రాకుండా ఉండాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాలు అమలు చేస్తున్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు కులాంతర వివాహ పథకం ద్వారా పేద వధూవరులకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. పేదకుటుంబాల నూతన దంపతులకు ఇచ్చే సాయం మొత్తాన్ని గత టీడీపీ ప్రభుత్వం కంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రెండింతలు చేసింది. టీడీపీ ప్రభుత్వంలో ఈ పథకం కింద అరకొరగా పెళ్లి కానుక అందించారు. ఆదీ సవాలక్ష షరతులు విధించడంతో అర్హులైన వారు ఈ పథకం ద్వారా సాయం పొందలేకపోయారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాల ద్వారా ఏటా నాలుగు సార్లు నూతన వధూవరులకు లబ్ధి చేకూరుస్తోంది. ఈ రెండు పథకాల ద్వారా గడివేముల మండలంలో 45 మందికిపైగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందించారు.

ఇవీ మార్గదర్శకాలు...

వివాహం జరిగిన నెల లోగా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. వధూవరులిద్దరూ టెన్త్ పాసై ఉండాలి. వధువుకు 18, వరుడికి 21 ఏళ్ల వయసు నిండాలి. వరుడు ఇతర రాష్ట్రానికి చెందిన వాడైనా, వధువు మాత్రం ఏపీ నివాసితురాలైతే పథకం వర్తిస్తుంది. భర్త చనిపోయిన స్త్రీకి రెండో వివాహం అయినప్పటికీ అర్హురాలే. కుటుంబ నెలవారీ ఆదాయం పల్లెల్లో రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు మించరాదు. కుటుంబానికి మాగాణి 3 ఎకరాలు, మెట్ట 10 ఎకరాలకు మించి ఉండరాదు. రెండు కలిపి పదెకరాలు మించకూడదు.

దరఖాస్తుకు జతచేయాల్సినవి

వధూవరుల ఆధార్‌కార్డులు, టెన్త్ మార్కుల జాబితా, ఇద్దరి ఈ మెయిల్ ఐడీ, కుల ధ్రువీకరణ పత్రాలు, తల్లి, తండ్రి లేదా సంరక్షకుల ఆధార్ జిరాక్స్ కాపీలు, పెళ్లి ఫొటోలు, మ్యారేజ్ సర్టిఫికెట్, వివాహ పత్రిక, దివ్యాంగురాలయితే సదరం సర్టిఫికెట్, రెండో వివాహం చేసుకునే పెళ్లి కుమార్తె అయితే మొదటి భర్త మరణ ధ్రువీకరణ పత్రం లేదా వితంతు పింఛన్ కార్డు జిరాక్స్ పత్రాలతో పట్టణ, గ్రామ సచివాలయాల్లో కేవలం పెళ్లి కూతురు పేరుతో దరఖాస్తులు నమోదు చేస్తున్నారు. నమోదు చేసిన వెంటనే అప్లికేషన్ ఐడీ నంబర్ లబ్ధిదారుల మొబైల్ నంబర్‌కు వస్తుంది.

భారీగా పెరిగిన పెళ్లి కానుక సాయం

కేటగిరీ	గత టీడీపీ ప్రభుత్వంలో (రూ.లలో)	వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీ తోఫా (రూ.లలో)
ఎస్సీ	40 వేలు	లక్ష
ఎస్సీ కులాంతర వివాహం	75 వేలు	1.20 లక్షలు
ఎస్టీ	40 వేలు	లక్ష
ఎస్టీ కులాంతర వివాహం	50 వేలు	1.20 లక్షలు
బీసీ	35 వేలు	50 వేలు
బీసీ కులాంతర వివాహం	50 వేలు	75 వేలు
మైనార్టీలు	50 వేలు	లక్ష
దివ్యాంగులు	లక్ష	1.50 లక్షలు
నిర్మాణ కార్మికులు	20 వేలు	40 వేలు

అన్ని వర్గాలకూ చేయూత



రాష్ట్ర ప్రభుత్వం కల్యాణమస్తు పథకం ద్వారా వెనకబడిన వర్గాల ప్రజలకు ఆసరాగా నిలుస్తోంది. ఈ పథకం ద్వారా సాయం సొమ్మును రెట్టింపు చేయడం వల్ల పేద యువతులకు ఎంతో మేలు కలుగుతుంది. సీఎం జగనన్నకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం. గత ప్రభుత్వం కంటే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం పెళ్లి కానుక సాయం పెంచిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుంది.

– సల్కాపురం వెంకట సులోచన, నాగ కిరణ్, గడిగరేవుల గ్రామం

ఎంతో ఉపయోగం



పెళ్లి చేయడానికి ఎంతో కష్టంగా ఉన్న ఈ రోజుల్లో రూ.లక్ష ఆర్థిక సాయం చేయడం ఎంతో సంతోషదాయకం. మా పెళ్లి 05.05.2023 నాడు జరిగింది. వైఎస్సార్ కళ్యాణమస్తు పథకం వల్ల ఆడపిల్లల తల్లిదండ్రులకు పెళ్లి ఖర్చు భారం తగ్గుతోంది. సీఎం జగన్ మోహన్ రెడ్డి అన్నలాగే పేద కుటుంబాల యువతులకు అండగా ఉంటున్నారు.

– మంజలి స్వాతి, మధు, చిందుకూరు గ్రామం

భూసేకరణ వేగవంతం చేయండి



మాట్లాడుతున్న రోడ్లు, భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న, జేసీ నారపురెడ్డి మౌర్య

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలో జాతీయ రహదారుల విస్తరణకు భూసేకరణ వేగవంతం చేయాలని రాష్ట్ర రవాణా రోడ్లు, భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న ఆదేశించారు. బుధవారం ఆయన కర్నూలు కలెక్టరేట్ నుంచి అన్ని జిల్లాల జాయింట్ కలెక్టర్లు, ఇతర అధికారులతో జాతీయ రహదారుల భూసేకరణపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. భూసేకరణలో వస్తున్న సమస్యలు, పరిహారం తదితర వివరాలను తమకు నివేదిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అటవీ, వక్ఫ్ భూముల సేకరణకు అనుమతుల కోసం సంబంధిత శాఖలకు నివేదిక పంపాలన్నారు. అనంతరం జిల్లాలో భూసేకరణ చేస్తున్న సోమయాజులపల్లె-డోన్, ఆత్మకూరు-సంగమేశ్వరం రోడ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నన్నూరు ఫుట్ ఓవర్ బ్రిడ్జి, హుసేనాపురం సమీపంలోని అండర్ పాసేజ్ బ్రిడ్జిలను త్వరగా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి కోరినట్లు ఆయన వివరించారు. జేసీ నారపురెడ్డి మౌర్య, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, నేషనల్ హైవే అధికారులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 18 వాహనాలు సీజ్

కర్నూలు: కర్నూలు శివారు సుంకేసుల రోడ్డులోని సంజీవని హాస్పిటల్ వద్ద ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రం అలంపూర్‌లో మద్యం సేవించి 44వ నంబర్ జాతీయ రహదారిలో వాహనాలు నడుపుతూ కర్నూలుకు వస్తున్న 12 మంది ద్విచక్ర వాహనదారులు, ఆరుగురు ఆటోడ్రైవర్లను అదుపులోకి తీసుకుని వాహనాలను సీజ్ చేశారు. గురువారం మందుబాబులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు డీఎస్పీ వెల్లడించారు.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మండల ప్రత్యేకాధికారిణి శ్యామల

సి.బెళగల్: ప్రభుత్వ లక్ష్యాలకు అనుగునంగా అధికారులు, ఉద్యోగులు పనిచేయాలని మండల ప్రత్యేకాధికారిణి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల అన్నారు. బుధవారం ఓఆఈఆర్డీ సందీప్‌తో కలిసి మండలంలోని ముడుమాల, కొండాపురం గ్రామాలలో పర్యటించారు. ఆయా గ్రామాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. గ్రామంలోని రెగ్యులర్ ప్రాథమిక పాఠశాల, జెడ్పీ హైస్కూళ్లను ఎంఈఓ ఆదాంబాషాతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాడు-నేడు పనులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి నాణ్యతగా లేకపోవడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులతో కలిసి భోజనం చేసి అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, భోజన నిర్వాహకులతో సమావేశమై పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాలను, వైద్య సబ్ సెంటర్లను తనిఖీ చేసి లబ్ధిదారులకు అందుతున్న సేవలు, నిర్వహణ తీరును పరిశీలించి సూచనలు చేశారు. గ్రామాలలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలను గడువులోగా పూర్తి చేసేలా చూడాలని ఇంజినీర్లను ఆదేశించారు. గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి, ఉద్యోగుల హాజరు, విధుల నిర్వహణ, స్పందన సమస్యలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించి, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి సుధాకర్ ఉన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు



మెరుగుదొడ్డి గ్రామంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి లబ్ధిదారుడి ఇంటి ముంగిటకే చేరుతున్నాయని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. ఆయన బుధవారం మండలంలోని మెరుగుదొడ్డి గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి గడిచిన నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించడంతో పాటు ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మెరుగుదొడ్డి గ్రామస్తులు మాట్లాడుతూ.. తమ గ్రామంలో సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వెంటనే రోడ్డు వేయించి తమ సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరగా, గ్రామంలో ఎక్కడెక్కడ సీసీ రోడ్లు, మురుగునీటి కాల్వలు అవసరమవుతాయో అంచనాలు రూపొందించాలని పీఆర్ ఏఈ గంగరాజును ఎమ్మెల్యే ఆదేశించారు.

ప్రజా సమస్యలు పరిష్కారమే ధ్యేయం

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత 70 ఏళ్లలో ఏ ప్రభుత్వం అందించని విధంగా పార్టీలకతీతంగా అర్హతే ప్రామాణికంగా నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. ఎస్‌ఐ శ్రీనివాసులు, డీటీ రామాంజనేయులు, ఏపీఎం పుష్పావతి, ఉపసర్పంచ్ గోవర్ధన్, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఇమ్మానేయులు, స్థానిక నాయకులు నాగేంద్ర, గోపాల్, సోమశంకర్‌యాదవ్, కృష్ణ, వెంకటప్ప, దస్తగిరి, సచివాలయ సిబ్బంది, హెల్త్ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వం @ 200



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, పక్కన మేయర్ బీవై రామయ్య

కల్లూరు: ప్రజా సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేలా ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ) కార్యక్రమం ప్రవేశపెట్టిందని వైఎస్సార్‌సీపీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మేయర్ బీవై రామయ్య అన్నారు. కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని ఏ గ్రామంలోకి వెళ్లినా సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు, మహిళలు, ప్రజలు అపూర్వ స్వాగతం పలుకుతున్నారని ఎమ్మెల్యే కాటసాని అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 19వ వార్డులో ఎమ్మెల్యే కాటసాని చేపట్టిన కార్యక్రమంతో జీజీఎంపీ 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సమావేశం ఏర్పాటు చేసి భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే సతీమణి ఉమామహేశ్వరమ్మ, తనయుడు శివనరసింహారెడ్డి హాజరు కాగా వారిని వైఎస్సార్‌సీపీ నాయకులు భారీ గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. అర్బన్ ప్రాంతం రోజురోజుకు విస్తరిస్తుండటంతో ప్రాధన్యతలను అనుసరించి మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. మేయర్ రామయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో కర్నూలు నగరంతో పాటు కల్లూరు అర్బన్ వార్డులను అభివృద్ధిలోకి తీసుకువస్తామన్నారు. డిప్యూటీ మేయర్ రేణుక, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, నాయకులు మహేశ్వర్‌రెడ్డి, మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి పెద్దపీట: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లాల అధ్యక్షులు, ఎమ్మెల్యే కాటసాని, మేయర్ రామయ్య అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ 19వ వార్డు రెవెన్యూ కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, మేయర్ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ సంక్షేమ పథకాల బుక్‌లెట్లను పంపిణీ చేశారు. మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పిల్లలకు టీకాలు వేయించాలి



పసుపలలో వైద్య సిబ్బందితో డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య

కర్నూలు (న్యూటౌన్): గర్భిణులు, చిన్న పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రామగిడ్డయ్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం కర్నూలు మండలం పసుపుల గ్రామంలో జరుగుతున్న వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వ్యాధి నిరోధక టీకాలు సక్రమంగా అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. అన్ని యాప్‌లలో ప్రోగ్రామ్స్ అప్‌లోడ్ చేయాలన్నారు. గార్గేయపురం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



ప్యాలకుర్తిలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలో వార్డు మెంబర్-6, ప్యాలకుర్తి గ్రామంలోని వార్డు మెంబర్-1 స్థానానికి ఈనెల 19వ తేదీన జరిగే ఎన్నికల్లో భాగంగా బుధవారం ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆయా గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. గోరంట్ల వార్డు మెంబర్-6 స్థానానికి పుల్లగుమ్మి శ్యామల, లక్ష్మీదేవి, లాలెమ్మ పోటీ పడుతుండగా, ప్యాలకుర్తి వార్డు మెంబర్-1 స్థానానికి సంగాల సుగుణమ్మ, సంజపోగు సుశీలమ్మ పోటీ పడుతున్నారు. ఈ మేరకు బరిలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల అధికారులు గుర్తులను కూడా కేటాయించారు.

అర్హులందరికీ పథకాలు అందాలి



గడిగరేవుల సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న జనార్ధన్‌రావు

గడివేముల: జిల్లాలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేలా సచివాలయ ఉద్యోగులు పనిచేయాలని గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా అధికారి, డీఎల్‌డీఓ జనార్ధన్‌రావు ఆదేశించారు. బుధవారం గడివేముల సచివాలయం-1తో పాటు గడిగరేవుల సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లోని ప్రజలు చెత్తను బయట పడవేయకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వీధుల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బ్లీచింగ్‌పౌడర్ చల్లించాలని సూచించారు. అలాగే సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని, ప్రతి రోజు మధ్యాహ్నం స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ప్రశంసలు

ఓర్వకల్లు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో ఎంపీడీఓ శివనాగప్రసాద్ అందించిన సేవలకు ప్రశంసలు లభించాయి. జిల్లా పెరేడ్స్ గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల సందర్భంగా పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కలెక్టర్ డాక్టర్ సృజన సమక్షంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని శివనాగప్రసాద్ అందుకున్నారు. జిల్లాలో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న ముగ్గురు ఎంపీడీఓలలో శివనాగప్రసాద్ ఒకరు కావడం గమనార్హం. ఆయన గత రెండేళ్ల నుంచి ప్రభుత్వం చేపట్టిన నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా జగనన్న హౌసింగ్ కాలనీలలో ఇళ్ల నిర్మాణాల్లో అత్యుత్తమ పురోగతి సాధించి జిల్లాలోనే ఓర్వకల్లు మండలాన్ని అగ్రస్థానంలో నిలిపారు. అలాగే ఇటీవల నిర్వహించిన జగనన్న సురక్ష పథకం ద్వారా మండలంలో మొత్తం 23,961 మందికి ఉచితంగా ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేయడంలో ప్రధాన పాత్ర పోషించారు. అంతేగాక పింఛన్ల పంపిణీ, అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, సున్నావడ్డీ, జగనన్న విద్యా కానుక, విద్యా దీవెన, వసతి దీవెన తదితర పథకాలను లబ్ధిదారులకు సకాలంలో అందించడంలో చొరవ చూపడంతో ఆయన సేవలను గుర్తించిన జిల్లా అధికారులు ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు



గుండ్రేవులలో వైఎస్సార్ పొలం బడి నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

సి.బెళగల్: రైతులు వరి పంట సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులను పొందవచ్చని ఏఈఓ సిద్ధు అన్నారు. బుధవారం మండలం పరిధిలోని గుండ్రేవుల, కొండాపురం గ్రామాలలో గ్యాప్ (జీఏపీ - గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్)లో భాగంగా మండల వ్యవసాయ అధికారులు, సిబ్బంది వరి పొలాల్లో వైఎస్సార్ పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు వరి పంట సాగు విధానంపై అవగాహన కల్పిస్తూ, పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం (జెడ్‌బీఎన్‌ఎఫ్ - జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్) పద్ధతులను తెలియజేశారు. వరి నాటడానికి ఒక్క రోజు ముందు కలిపిన బీజామృతంలో వేర్లు పూర్తిగా తడిసేలా ముంచడంతో పాటు, కొనలు కత్తిరించి నాట్లు వేయించారు. పంట సంస్యరక్షణ పద్ధతులను వివరించారు. వ్యవసాయ సహాయకులు, ఎంపీఈఓలు, వ్యవసాయ సిబ్బంది రైతులతో కలిసి పొలాల్లో వరి నాట్లు వేశారు. ఎంపీఈఓలు వెంకటేష్, సోమేశ్వరి, వీఏఏ నాయక్, జెడ్‌బీఎన్‌ఎఫ్ సిబ్బంది, రైతులు ఉన్నారు.

ఓటరు జాబితా సవరణకు సహకరించండి



మాట్లాడుతున్న ఆర్డీఓ హరిప్రసాద్

గూడూరు: ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కర్నూలు ఆర్డీఓ హరిప్రసాద్ కోరారు. ఆయన బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ శివశంకర్‌నాయక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేసేందుకు బీఎల్‌ఓ లు ఇంటింటికీ తిరుగుతున్నారని, వారికి రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలన్నారు. డబుల్ ఎంట్రీలు, మృతి చెందిన వారి పేర్ల తొలగింపుతో పాటు ఒక కుటుంబంలోని ఓటర్లందరూ ఒకే పోలింగ్ బూత్ పరిధిలో ఉండేలా చూడాలన్నారు. ఈ నెల 21 నాటికి ఓటరు వెరిఫికేషన్ సర్వే పూర్తి చేస్తామన్నారు. అలాగే జనవరి 1 నాటికి 18 ఏళ్ల వయసు నిండే వారందరికీ ఓటు హక్కు కల్పిస్తామని చెప్పారు.

తిప్ప భూమిని పరిరక్షించండి



తహసీల్దార్ శివశంకర్‌నాయక్‌కు వినతి పత్రం ఇస్తున్న చనుగొండ్ల గ్రామస్తులు

గూడూరు: మండలంలోని చనుగొండ్ల గ్రామంలో సర్వే నంబర్ 222లో 58 ఎకరాల ప్రభుత్వ భూమి(తిప్ప)ను బి.ఆనంద్ అనే వ్యక్తి కబ్జా చేశాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు బుధవారం తహసీల్దార్ శివశంకర్‌నాయక్‌కు వినతి పత్రం అందించారు. ప్రభుత్వ భూమిని గ్రామ అవసరాలకు వినియోగించుకుంటున్నామని, అయితే ఆనంద్ అనే వ్యక్తి ఆ పొలంలో మట్టిని విక్రయించుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా ఆ భూమిని అన్యాక్రాంతం చేస్తున్నాడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై తహసీల్దార్ మాట్లాడుతూ విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.